నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 12 ఏప్రిల్ 2025 | NIZAMABAD

## నేడు హనుమాన్ జయంతి

**ఉమ్మడి జిల్లాలో** శనివారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సారంగపూర్ హనుమాన్, గోల్ హనుమాన్, రోకడ్ హనుమాన్, నల్ల హనుమాన్ మందిరంతోపాటు కామారెడ్డి జిల్లాలోని హనుమాన్ ఆలయాలను వేడుకలకు ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు. సిందూర పూజలు, వడ, తమలపాకు పూజలు చేయనున్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులు వీరహనుమాన్ విజయయాత్ర, శోభాయాత్ర నిర్వహించనున్నారు.
–సుభాష్‌నగర్, ఏప్రిల్ 11



విద్యుత్ వెలుగుల్లో నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోల్ హనుమాన్ ఆలయం



డిచ్‌పల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల, పక్కన రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

# పదేండ్లు జనరంజక పాలన

- అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన కేసీఆర్
- 'వరంగల్ సభ'కు బీఆర్ఎస్ శ్రేణులు ఉప్పెనగా తరలిరావాలి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 11 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పదేండ్లు జనరంజక పాలన అందించారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపారని పేర్కొన్నారు. వరంగల్ ఈ నెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ నేపథ్యంలో తీసుకోవాల్సిన ఏర్పాట్లపై నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే, ఆర్టీసీ మాజీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి డిచ్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైపోతున్న తెలంగాణకు విముక్తి కల్పించడానికి, తమకు అందాల్సిన హక్కులను కోల్పోతున్న ప్రజల కోసం రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా కేసీఆర్ ఒక్కడిగానే బయల్దేరారని గుర్తుచేశారు. ఉద్యమంలో తాను వెనక్కి పోతే రాళ్లతో కొట్టండని సబ్బండ వర్ణాలను ఏకతాటిపై తీసుకొచ్చారని తెలిపారు. 14 ఏండ్లు మడమ తిప్పని సుదీర్ఘ పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. తెలంగాణ తొలి సీఎం గా కేసీఆర్ పదేండ్లపాటు జనరంజక పాలన అందించి, అనేక రంగాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలిపారన్నారు. రాష్ట్రాన్ని కరెంట్ కోతల నుంచి గట్టెక్కించి తాగు, సాగునీటి బాధల నుంచి విముక్తి కల్పించి కునారిల్లుతున్న వ్యవసాయ రంగాన్ని పండుగ చేసి ప్రతిరైతునూ ఆదుకున్నారని పేర్కొన్నారు.

**వరంగల్ సభకు లక్షలాదిగా తరలిరావాలి..**

ప్రస్తుతం రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తున్న అధికార పార్టీ నాయకులకు గూబ గుయ్యుమనేలా సమాధానం చెప్పడానికి వరంగల్ సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు వరంగల్ సభకు లక్షలాదిగా తరలిరావాలని కోరారు. ప్రజలు సభకు వచ్చేలా వారిలో స్ఫూర్తి నింపేలా గ్రామ గ్రామాన వాల్‌పోస్టర్లు, వాల్ పెయింట్ వేయించాలన్నారు. ఏడాదికాలం పాటు పార్టీ కార్యక్రమాలు, ప్రజల పక్షాన పోరాడే కార్యక్రమాలు ఉంటాయని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని వేముల పిలుపునిచ్చారు.

**15న దిశానిర్దేశం..**

రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ ఈనెల 15న మధ్యాహ్నం 2 గంటలకు డిచ్‌పల్లి మండల కేంద్రంలో సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ప్రస్తుతం రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, నాయకులు నల్లవెల్లి సాయిలు, శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య, పద్మారావు, నడ్పన్న, సుందర్, గీత, బుచ్చమ్మ, సరిత, నయీం, అక్బర్‌ఖాన్, యూసుఫ్, రాథోడ్, గిరి, జాకీర్, పాషా, శంకర్, తిరుపతి, లక్ష్మణ్, సుఖేందర్, సంతోష్, ప్రవీణ్, ఒడ్డెన్న, రమేశ్, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్, ముత్యంరెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

# ముగ్గు దశలోనే.. ఇందిరమ్మ ఇండ్లు!

## నత్తనడకన నిర్మాణ పనులు

- మంజూరుకు తగ్గట్లుగా కొనసాగని నిర్మాణాలు
- పెట్టుబడిలేక ముందుకురాని లబ్ధిదారులు
- అడ్డంకిగా మారిన ప్రభుత్వ నిబంధనలు
- పథకానికి 31 గ్రామాల నుంచి 2,762 మంది అర్హుల ఎంపిక
- ఇప్పటి వరకు పునాది దశలోనే 440 ఇండ్లు

*కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం జిల్లాలో నీరుగారుతున్నది. ఈ పథకం అమలుపై లబ్ధిదారులు కూడా ఆసక్తి చూపడంలేదు. ఫలితంగా మంజూరైన ఇండ్లకు తగ్గట్లుగా నిర్మాణాలు జరగడంలేదు. ఇందుకు ఒకవైపు ప్రభుత్వం విధించిన నిబంధనలు కాగా.. మరోవైపు లబ్ధిదారుల వద్ద పెట్టుబడి లేకపోవడం కారణంగా తెలుస్తున్నది. పథకాన్ని ప్రారంభించి చాలా రోజులు గడుస్తున్నప్పటికీ మంజూరైన ఇండ్లలో సగాని కన్నా ఎక్కువ మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించలేదు. ఇప్పటి వరకు 31 గ్రామాల్లో లబ్ధిదారులను గుర్తించి వారికి, ఇండ్లను మంజూరు చేశారు. ఆర్థిక సంవత్సరం ముగింపులోపే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు ఇచ్చినా, ఇప్పటి వరకు పునాది తీసేందుకు కూడా ముందుకు రావడం లేదు. ప్రతి ఇంటికీ రూ.5లక్షలు మంజూరు చేసి, ఐదు విడుతల్లో ఆర్థిక సాయం ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసినప్పటికీ, ఇండ్ల నిర్మాణాల్లో వేగం పుంజుకోవడం లేదు. ఇండ్ల కోసం ముగ్గులు పోసేందుకు చూపిన ఉత్సాహం.. నిర్మాణానికి వచ్చే సరికి కనిపించడం లేదు.*
*–నిజామాబాద్, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*



**ఇందిరమ్మ ఇండ్ల పథకం** మొదటి విడుత కింద నిజామాబాద్ జిల్లాలో 31 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ గ్రామాల పరిధిలో మొత్తం 2,762 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరందరికీ ఇండ్లను మంజూరు చేయడంతోపాటు వారి సొంత స్థలాల్లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఎంపిక చేసిన గ్రామాల్లో పూర్తి స్థాయిలో ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత ఇతర గ్రామాల్లో మంజూరు చేసి పనులు చేపట్టాలని భావిస్తున్నారు. కానీ 31 గ్రామాల్లో ఇప్పటి వరకు కేవలం 440 ఇండ్ల నిర్మాణాల కోసం లబ్ధిదారులు ముగ్గులు పోసుకుని పునాది పనులు చేపడుతున్నారు. వీటిలో 170 ఇండ్లు బేస్‌మెంట్ స్థాయిలో పూర్తి కాగా, వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. మొదటి విడుత నిధులను లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు సైతం చేస్తున్నట్లు హౌసింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేస్తున్నది, ఇండ్ల నిర్మాణం ఆధారంగా ఐదు విడుతల్లో ఈ నిధులను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనున్నారు. బేస్‌మెంట్ స్థాయిలో రూ.లక్ష, లెంటల్ స్థాయిలో రూ. లక్ష, రూఫ్ స్థాయిలో రూ.లక్ష, స్లాబ్ స్థాయిలో రూ.లక్ష, ఇండ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత చివరి పేమెంట్‌గా రూ.లక్ష చొప్పున నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయనున్నారు. మొత్తం ఐదు విడుతల్లో నిధులను మంజూరు చేస్తారు. ఎంపిక చేసిన గ్రామాల వారీగా మంజూరైన మొత్తం ఇండ్లతో, పనులు మొదలైన ఇండ్ల సంఖ్యను పోల్చుకుంటే చాలా తక్కువ స్థాయిలోనే నిర్మాణాలు నత్తనడకన కొనసాగుతున్నట్లుగా కనిపిస్తున్నది.

### జేబులు నింపుకొంటున్న అధికారులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు ఇటుక, సిమెంట్, ఇసుక, ఇనుము వంటివేవి గృహ నిర్మాణ శాఖ సరఫరా చేయడం లేదు. అందుబాటులో లభించే ఇసుకను మాత్రమే ఉచితంగా తెచ్చుకునేందుకు అనుమతులను మంజూరు చేస్తున్నారు. ఎంపిక చేసిన గ్రామాల్లో ఇండ్ల నిర్మాణానికి ఆయా మండలాల తహసీల్దార్లు ఇసుక కోసం అనుమతులను మంజూరు చేస్తున్నారు. ఇదే అదనుగా కొందరు తహసీల్దార్లు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పేరిట జేబులు నింపుకుంటున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ఆసక్తి చూపని లబ్ధిదారులు

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై లబ్ధిదారులు ఆసక్తి చూపడంలేదు. ఇండ్లను 400 చదరపు అడుగులలోపు నిర్మాణం చేపట్టాలి. నిర్మాణ సమయంలో బేస్‌మెంట్ వరకే పిల్లర్లు వేయాలి. తొమ్మిది పిల్లర్లను మాత్రమే వేయాలని ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. కొంత మంది లబ్ధిదారులు మాత్రం పిల్లర్లను స్లాబ్ వరకు వేస్తుండగా మరికొంత మంది బేస్‌మెంట్ వరకే వేస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం రూ.5లక్షలకే మోడల్ ఇండ్లకు ఖర్చు అవుతున్నట్లుగా వివరిస్తున్నారు. వాస్తవంగా పరిశీలిస్తే అదనంగా భారం పడే అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఒక్కో ఇంటికి అదనంగా రూ.2లక్షలు నుంచి రూ.3లక్షల వరకు భారం మోయాల్సి వస్తున్నది. లబ్ధిదారుల ఎంపిక సమయంలో నిబంధనల మేరకే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు మాత్రం కొన్ని చోట్ల స్థలం ఎక్కువగా ఉండడంతో తమకు అనుకూలంగా ఇండ్ల నిర్మాణం చేపట్టారు. గ్రామాల్లో 100 నుంచి 200 గజాల కన్నా ఎక్కువ స్థలం ఉన్న వారున్నారు. 400 చదరపు అడుగులలోనే ఇల్లు కట్టుకోవాలంటే చాలా మంది వెనుకడుగు వేస్తున్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కనీసం వెయ్యి నుంచి 1200 చదరపు అడుగుల వరకు ఇల్లు నిర్మించుకునే ఆలోచనలో చాలా మంది ఉన్నారు.



## మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు వేముల పరామర్శ

**బోధన్ మాజీ ఎమ్మెల్యే** షకీల్ ఆమేర్‌ను మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. షకీల్ తల్లి షగుఫ్త ఆదిబ్ రెండురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. షకీల్‌తోపాటు కుటుంబీకులను వేముల పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు షకీల్‌ను పరామర్శించారు.
-బోధన్, ఏప్రిల్ 11

## పూలేకు ఘన నివాళి

ఉమ్మడి జిల్లాలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్‌లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మోర్తాడ్ మండల కేంద్రంలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని, పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే అని కొనియాడారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు



# సౌత్ క్యాంపస్‌లో ధర్నా

- తమ సర్వీసు క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల డిమాండ్

భిక్కనూరు, ఏప్రిల్ 11: తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరుతూ మండలంలోని సౌత్ క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ చాంబర్ ఎదుట టీయూ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు మాట్లాడుతూ.. తాము 15 ఏండ్ల నుంచి పనిచేస్తున్నా ప్రభుత్వం తమ సర్వీసును గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ యాలాద్రి, సునీత, నర్సయ్య, రమాదేవి, నిరంజన్, వైశాలి, దిలీప్ పాల్గొన్నారు.



సౌత్ క్యాంపస్‌లో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

# ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

### వాగులోకి వెళ్లకుండా దారి మూసివేత



బీర్కూర్ మంజీరా బ్రిడ్జి కింద జేసీబీ సాయంతో దారిని మూసివేయిస్తున్న అధికారులు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 11: ఇసుక అక్రమ రవాణాకు అధికారులు చెక్‌పెట్టారు. బీర్కూర్ మండల కేంద్రంలో మంజీరా బ్రిడ్జి కింది నుంచి ఇసుకను అక్రమంగా తరలించడానికి ఇసుకాసురులు ఏర్పాటు చేసుకున్న దారిని మూసివేయించారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి గురువారం సాయంత్రం డోంగ్లి మండలం నుంచి బీర్కూర్‌కు వెళ్తుండగా బీర్కూర్ బ్రిడ్జి కింద మంజీరా నదిలో కుర్ల శివారులో అక్రమంగా రెండు ట్రాక్టర్లలో ఇసుకను నింపడాన్ని గమనించారు. వెంటనే వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించగా డ్రైవర్లు ట్రాక్టర్లను అక్కడే వదిలి పారిపోయారు. దీంతో సబ్ కలెక్టర్ కిరణ్మయి, బీర్కూర్, డోంగ్లి మండలాల తహసీల్దార్లు, ఆర్ఐలు, పోలీసుల సమక్షంలో ఇసుక రవాణాకు వినియోగిస్తున్న దారిని శుక్రవారం తొలగింపజేశారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపట్టినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు.

# ధాన్యం కొనుగోళ్లలో జాప్యం



లక్మాపూర్ సొసైటీ వద్ద నిర్వాహకులను నిలదీస్తున్న రైతులు

- లక్మాపూర్ సొసైటీ వద్ద రైతుల ఆందోళన
- కేంద్రం నిర్వాహకుల నిలదీత

చందూర్, ఏప్రిల్ 11: ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ రైతులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. మండలంలోని లక్మాపూర్ సొసైటీ వద్ద మేడ్‌పల్లి, కారేగాం, లక్మాపూర్ గ్రామానికి చెందిన రైతులు కేంద్రం నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ధాన్యం కోసి వారం రోజులు దాటినా కొనుగోలు చేయకుండా సంబంధీకులవి మాత్రమే కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులందరినీ సమానంగా చూడాలన్నారు. ధాన్యం నింపడానికి గన్నీ సంచులు లేవన్నారు. అకాల వర్షాలతో ఆరబోసిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి నానా తంటాలు పడుతున్నామని వాపోయారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచులను అందుబాటులో ఉంచాలని, ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న చందూర్ సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ అక్కడికి చేరుకున్నారు. కేంద్రం నిర్వాహకుల నిర్లక్ష్యానికి క్షమించాలని, ఇలాంటి తప్పిదాలను జరగకుండా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. సొసైటీ వైస్ చైర్మన్ తారాసింగ్, కార్యదర్శి భూమయ్య, సొసైటీ మాజీ చైర్మన్ చంద్రునాయక్ , చత్రుసింగ్, డైరెక్టర్లు పాల్గొన్నారు.